* ద్వాపరికం *

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

ఆవేళ నారాయణరావు చాలా చికాకుగా ఇంటి కొచ్చాడు.

రాత్రి భోంచేసి సావకాశంగా పక్కగది వరండామీద వాలుకుర్చీ వేసుకుని తోట ఆవరణ వంక చూస్తూ కూచున్నాడు. సుశీల పావంచాలమీద కూచుని పాన్దాను పక్కన పెట్టుకుని తములపాకుల ఈనెలు తీస్తోంది. మసక వెన్నెట్లో చుట్టూ కదులుతున్న పత్తి, మందార చెట్లనీడలు కొత్తగా వెల్ల వేసిన గోడమీద రకరకాల చలనచిత్రాలనూ కల్పిస్తున్నాయి. అంతవరకూ ఆమె ఎవరితో మాట్లాడుతోందో కనుక్కుంటే పాపన్నశాస్త్రిగారి అమ్మాయితో నని చెప్పింది. —

"అంటే పెళ్లి గావాలిసిన పిల్ల ఈమేనా?

"అవునవును"

"సంబంధ మేదయినా స్థిరపడినట్టా?

"ఒపట్టాన్ని కుదురుతుందీ? బ్రహ్మసమాజం పుచ్చుకున్న బ్రాహ్మణవరుడు కావాలిట! మంచి హోదాగల ఉద్యోగంలో వుండాలట!!

"బికారి! వీడు నన్ను ఎద్దేవా చెయ్యొచ్చాడు— మళ్లీ కులవికృతులు కూడవని గుండెలు గవుక్కొంట్లో లెక్చర్లిమ్మనమంటే గంటలతరబడి ఇస్తాడు. వుదయం వాడికీ నాకూ పెద్ద ఘర్షణ జరిగిందిలే"

"దేనికి?"

"మన పెళ్లినిగురించి — వీడితోటి వొకటా? వితంతువివాహాలు శాస్త్రీయమైనవి అని నమ్మినా, నేనుమాత్రం కన్యా వితంతువు కావాలనీ, భర్తతో కాపరంచేసిన స్త్రీని వివాహం కాననీ విరి కోరి వితికి నిన్ను పెళ్ళి చేసుకున్నానట. అంచాత నేను నికరమైన బ్రహ్మోని కానట. వీడుమహా......

"సరిపోయింది — దొంగలుపడ్డ ఆరునెలలకి కుక్క మొరిగిందట—ఏనాటి పెళ్లి? మూడేళ్ళ క్రితం జరిగిందానికి ఇప్పుడు తర్జన భర్జన లెందుకూ? అయినా, పాపన్నశాస్త్రికి పనా పాటా? అసలే యతిమత మాయనది. డీ అంటే డీ అంటో కూచుంటాడాయన. మీ శరణాలయ మేమిటో, మీ వ్యవహారాలేమిటో చక్కబెట్టుకోంటో మీ మానాన్ని మీరుండక మాట్లాడితే ఆయనతో మీకెందుకు రగడ చెప్పండి?"

చుట్టూ తిరిగి మళ్ళీ తనమీదకే వచ్చింది—అదీ నిజమే—దుష్టుడికి దూరంగా వుండమన్నారు... సరిపెట్టుకుని చక్కా వూరుకున్నాడు నారాయణరావు.

నారాయణరావు తండ్రి తాతలంతా బ్రహ్మసమాజ మతస్థులు. అంచేత తనూ బ్రహ్మోననే అనిపించుకుంటున్నాడు. కాని అతనిలోవున్న పితృదేవతల రక్తమింకా సంస్కరణోద్దేశాలవంక పూర్తిగా మొగ్గుచూపకండా వొచ్చింది. పాతఅంతా చెత్తకింద కొట్టివెయ్యనూ లేడు. కొత్తఅంటే వ్యామోహం తగ్గించుకోనూ లేడు. పోనీ పాతకొత్తలలో వుండే మంచిని విడమరిచి తన జీవితంలో చక్కా సమన్వయించుకోగల సత్తానూ లేదతనికి. ఆ రెంటికీ జరిగే సంఘర్షణలో ఆ మనిషి నలిగిపోతున్నాడా అనిపిస్తుంది. అంచాత ప్రతిదాంట్లోనూ మధ్యేమార్గ మొకటి తొక్కుతో వుంటాడతను.

ఆయనదొక మతం—విడమరచి చూచుకుంటే మనిషికొక్క మతం తేలుతుందేమో—

సుశీల కన్యావితంతువని ఆమె తండ్రి నచ్చజెప్పినమీద నారాయణరావు ఆమెని వివాహం చేసుకోవడం జరిగింది. లేకపోతే ఆమెని చేసుకోకపోయేవాడే—దానిమీద నిసలైన బ్రహ్మోలమని చెప్పుకునే కొందరు పెద్ద మనుషులకు చాలా ఆగ్రహమొచ్చింది అతనిమీద. అతనుమాత్రం మొగాడికి కానీ ఆడదానికి గానీ రెండో పెళ్ళి అంటే శాస్త్రీయమైన ముద్ర పొందిన వ్యభిచారమని నిర్వచనం చెప్తాడు.

మొదట్లో సుశీల తండ్రి లాహోరులో రామమోహన శరణాలయంలో పనిచేస్తూ వుండేవాడు.

అప్పట్లో బ్రహ్మమతప్రచారం తీవ్రంగా సాగించే యువకులలో తెలుగు నాటినించి వచ్చి అక్కడ వుంటున్న ఒక కుర్రవాణ్ణి బుద్ధిమంతుణ్ణి చూచి సుశీల నిచ్చి పెళ్ళిచేశాడు. దరిమిలా ఆయన కాకినాడ బదిలీ కాకపూర్వమే సుశీల భర్త నష్టమైపోయాడు. కాకినాడలో సుశీలని నారాయణరావు కిచ్చి మళ్ళీ వివాహం జరిగించిన అనంతరం ఆయన కాలం చేశాడు. సుశీల తండ్రి పోయిన తరవాత శరణాలయంలో సూపరెండెంటుగిరీ నారాయణరావు చేతి కొచ్చింది.

నారాయణరావుకీ సుశీలకీ పసిపిల్లలంటే మహా ప్రీతి. నారాయణరావు శరణాలయంలో అడుగు పెట్టడం తరవాయి, తేనెతుట్టె చుట్టూ ఈగలు మూగినట్టు పిల్లలంతా కమ్మేస్తారు. దానితో ఎవ రెవరికి ఏమేమి పంచాలీ అన్న ఆలోచన అతనికి తెములక పూర్వమే అందరూ వొక్కసారిగా ఎగబడి బిసకొత్తులనీ, చాకలెట్లనీ, పిప్పరమెంట్లనీ, పంట్లాము జేబులోనించి తలా కాసినీ గబగబా లాగేస్తారు.

ఆవాళ సాయంత్రం టేబిలు క్లాత్తు అల్లుకొంటూ చీడీలమీద కూచుంది సుశీల. స్కూలు వొదిలిపెట్టారు గావును—అర్ఫనేజిలోనుంచి పిల్లల కేరింతాలు వినిపిస్తున్నాయి. పక్కని హవేలీ తోటలలోనించి దక్షిణపుగాలి జీడిమామిడి పూతలలో వూపిరి తీసుకుని చంటిపిల్లడిలా చెర్లాడుతోంది. గేటు తెరుచుకుని నీలిగోరింటచెట్ల చాలులోనించి నారాయణరావు వొస్తూ కనిపించాడు. కూడా అయిదేళ్ళ వొక పసిపిల్లణ్ణి నడిపించుకొస్తున్నాడు. సుశీల అల్లిక క్షణమాపి పసివాడివంక పరీక్షగా చూచి ఎవరా అన్నట్టు ప్రశ్నార్థకంగా నారాయణరావువైపు దృష్టి నిలిపింది.

నారాయణరావు మందహాసంలో అపురూపమైన వస్తువుని తీసుకొచ్చిన అహంకారం ప్రతిబింబిస్తోంది. సుశీల పిల్లాడిని దగ్గరికితీసుకొని, తల నిమిరి, విడిపోయిన బొత్తాములు పెట్టి మడతపడిన చొక్కా కాలరు సరిజేస్తూ వింటోంది. నారాయణరావు కథ యావత్తూ చెప్పాడు. నాలుగేళ్ళక్రితంమాట. లాహోరులో కాళీవుత్సవాలలో వొక పేదరాలికి తలిదండ్రులనుంచి తప్పిపోయి దొరికాడీ పిల్లవాడు. బిడ్డలమీద మమకారంచేత ఈ కుర్రవాణ్ణి ఇన్నాళ్లూ పెంచుకొచ్చి, ఖాయిలాపడి ప్రయాగలో మూంజీవారి సత్రంలో నిరాధారంగా చచ్చిపోతూ పసివాడిని ఒక పండాకి అప్పగించింది, ఆ అభాగిని. ఆ బ్రాహ్మడు పసికందుని అక్కడ అనాథశరణాలయంలో జేర్చి చక్కాపోయాడు. ఈమధ్య పాపన్న శాస్తుర్లు కొమార్తెకి సంబంధాలు వెతుక్కొంటూ ఆ ప్రాంతంలోకి వెళ్ళినప్పుడు శరణాలయంలో ఈ కుర్రాణ్ణిచూచి వచ్చీరాని మాటలనిబట్టీ విన్న వృత్తాంతాన్నిబట్టీ తెలుగుబిడ్డ అని గ్రహించి ఇక్కడ శరణాలయానికి తీసుకొచ్చి ప్రవేశపెట్టాడు.

సుశీల అశ్రద్ధగావింటో తీక్ష్ణంగా చూస్తోంది, పసివాడివంక. ఫొటో తీసుకునేముందు కదలని కెమేరాలా ఆమెదృష్టి అలాగే నిలిచిపోయింది. బైట చూపు లాగిపోయినా మనస్సు లోపల పనిచేస్తున్నట్టు ముఖభంగిమలో క్రీనీడలు తచ్చాడుతున్నాయి. నారాయణరావుకి ఆశ్చర్యంకలగ లేదు: సుశీలకి చంటిపిల్లలంటే విపరీతమైన సరదా. అందులోనూ అంత ముద్దైన బిడ్డ! చుట్టేసుకు నేందుకు ఏ బ్రహ్మనుకోసమో నల్లాడే తీగలలాంటి రూపురేఖలతో ముద్దు లూరించే పసితనం!!...సుశీల తాను విన్నదానికీ, చూస్తున్నదానికీ లత కలుపుకుంటోంది గావును. ఒడిలిపోయిన కవటాకుల్లో వున్న ఆ పసిబుగ్గలమీద ఇంకిపోయిన లేత మిసమిసలు చూపుల కందడంలేదు. పోషణలేక బక్కచిక్కిన ఆ రూపురేఖల మరుగున లేని జీవం కోసం తడుముకొంటూ వున్నట్టుంది సుశీల. అక్కున జేర్చుకుని, "పేరేమిటి నాయనా?" అని అడగటంతో మళ్ళీ యీ ప్రపంచంలోకి వచ్చింది. ఒళ్లోకి దగ్గరసా, ఇంకా దగ్గరసా ఇమిడిపోతూ "కిట్టూ" అని తీపులొలుకుతూ బదులుచెప్పాడు పసివాడు. ఆ కలకంఠ పలుకుల్లో చిక్కుపడి గిలగిల కొట్టుకుంది ఆమె లోపల నిద్రాణంగా దాగివున్న మాతృహృదయం.

మర్నాడు ప్రొద్దుట చల్లగాలికి శరణాలయంలో పిల్లలంతా బంగాళా యెదుట ఇసకలో పిచ్చికగూళ్లు కడుతున్నారు. ఆడపిల్లలు గుజ్జనగూళ్లు వండుతున్నారు. మొగరాయళ్లంతా భోజనాలకి సిద్ధంగా బైఠాయించి కూచున్నారు. కొంతమంది ఆడంగులు జీడిమామిడితోటలలోకి విస్తళ్లు తేబోయారు. జంగిడిలో మిఠాయివుండల్లా మెరుస్తున్న పిల్లలమధ్య కిట్టూ నిశ్శబ్దంగా కూచున్నాడు. కొంతమంది గడుసుబుర్రలు "వంట ఇంకా కాలేదే" మని ఆడపిల్లల్ని గదమాయిస్తున్నారు. ఇళ్లల్లో జరిగే దినచర్యలు పిల్లల ఆటలలో ఎలా ఛాయగా కనిపిస్తున్నాయో లీలగా దూరాన్నించి చూస్తోంది సుశీల.

నారాయణరావు ఆఫీసుకి వెళ్లిపోతున్నాడు.
"మాడండి!".

ఆగాడు.

బొటనవ్రేలితో నేలమీద రాస్తూ అడగటానికి సందేహిస్తోంది:

"కిట్టూని మనమెందుకు పెంచుకోగూడదూ?"

సమాధానంకోసం-లోపల వుబుకుతున్న ఆత్రతని వెనక్కి లాగిపట్టింది. నారాయణరావు గమనించలేదు. కాపరానికొచ్చి నాలుగేళ్ళు కాలేదు—అప్పుడే లోపల సంతానవాంఛ రేకెత్తుతోంది గావును అని ముసిముసిగా నవ్వుకున్నాడు. అతను మాత్రం పస్తాయించలేదు:

"అలాగే కానీ—వాడొక్కడూ మన సంసారానికి భారమవుతాడా?"

చెంపమీద ఒక చిన్న చిటిక వేసి వెనక్కి తిరిగిచూస్తూ వెళ్ళిపోతున్నాడు నారాయణరావు. సిగ్గుపొరలలో నువ్వు దాచుకున్న రహస్యంలోకి తొంగిచూచాలే అన్న కొంటెతనం చిలిపిగా అతని వైఖరిలో ద్యోతకమవుతూనేవుంది. సుశీల గమనించలేదు.

ఆమె కళ్లు దీపావళీ ప్రమిదల్లా గుప్పున వెలిగాయి. ఆ రోజునుంచీ సుశీల నట్టింట మసలడం ప్రారంభించాడు కిట్టూ.

కిట్టూ సహజంగానే మందకొడిగా వుంటాడు. ఆటలకనీ పాటలకనీ తోడిపిల్లలతో ఎప్పుడోగాని జేరడు. ఆకతాయి లెవరయినా అల్లరిపెడితే తుర్రున యింటిలోకిదూరి తల్లికోడి రెక్కలక్రింద వొదిగే పిల్లలా సుశీల పమిటచాటున నక్కి "అమ్మా కథలు చెప్పవూ?" అని గునుస్తాడు. మళ్ళీ వారంరోజులదాకా ఆటలకి దిగడు.

కిట్టూ రాగానే సుశీల అల్లిక పనులన్నీ మూలబడ్డాయి. అలంకారాలమీద ప్రీతి అశ్రద్ధగా మారింది. ఆమె కిట్టూకి నీళ్లు పోసి, బువ్వ పెట్టి క్రాపు దువ్వి చొక్కా లాగూ తొడిగి చంక నేసుకొని తారసిల్లుతుంటే వెయ్యి నగలు పెట్టుకొన్న గర్వం స్ఫురించేది, నారాయణరావుకి. ఇక పాటలకనీ పుస్తకాలకనీ అతనికి పురమాయింపులు తగ్గాయి వో మీటింగుకి వెళ్ళినా ఒక వినోదంలో మునిగినా సాయంత్రం పెందరాళే ఇంటిపట్టున లేకపోతే ఇవ్వాలసిన సంజాయిషీ జ్ఞాపకం రావటం మానుకుంది.

అసలు వాళ్ళ యిద్దరి భాషా నారాయణరావుకి సరిగ్గా వొంటబట్టలేదు. అప్పుడప్పుడు కిట్టూ తన సరసని కూచుని ఏవేవో విడ్డూరాలు చెప్పుకుపోతుంటే నారాయణరావుకి అర్థంకాక సతమతమయ్యేవాడు. సుశీల పనిగట్టుకొనివొచ్చి తర్జుమాచేసి "ఫలానా" అని విడమర్చి చెబితే, "అమ్మయ్య!" అనుకునేవాడు.

ఒక గాలివాన రాత్రి కిట్టూకి ఫ్లానల్ చొక్కా తొడిగి, సెయిలర్స్ టోపీ పెట్టి, రగ్గు బాగా కప్పి వాడేదో వచ్చీరాని కాకమ్మ కథ చెబుతుంటే 'వూ'—కొడుతోంది సుశీల. గూట్లో పిట్టల్లా వున్నారిద్దరూను, బయట ప్రపంచంతో సంబంధం లేనట్టు. తోటలో చిటపటమని వాన చినుకులు తాళంవేస్తూ ఆ రెండు హృదయాలకీ లయకలుపుతున్నాయి. వెనకాలే వొచ్చి నిలుచుని ఆ ఘటనకు క్షణకాలం ఆశ్చర్యంలో మునిగిపోయాడు, నారాయణరావు. ఏ పూర్వజన్మవాసనా ఫలితమో ఇది! సముద్రపువుప్పుకీ అడవి వుసిరికాయకీ వున్న సంబంధం గుర్తుకి తెచ్చుకుని కాస్సేపుతర్కించుకున్నాడు. చప్పున మునివేళ్ల మీద నడిచివెళ్ళి సుశీలకళ్లు గట్టిగా మూశాడు చమత్కారానికి. చేతులు మెల్లిగా వొదిలించుకుని, "ఏమిటండీ చిన్నతనపుచేష్టలు?" అన్నది సుశీల-తానప్పుడే పెద్ద ఆరిందా అయినట్టు. కిట్టూమాత్రం గట్టిగా చప్పట్లుకొట్టి వాళ్లిద్దరూ జారవిడుచుకున్న ఆనందాన్ని తానే కిలకిలనవ్వులతో పుణికి పుచ్చుకున్నాడు. ఆ నవ్వులలో కోవెల గంటలు టింగుటింగుమని మ్రోగాయి.

బ్రహ్మసమాజమందిరం పెళ్ళివారితో కిటకిటలాడుతోంది - పాపన్నశాస్త్రి కొమార్తె వివాహం. వరుడు చదువుకున్నవాడూ, చిన్నవాడూ, అన్నివిధాలా యోగ్యమైనసంబంధమని నలుగురూ చెప్పుకుంటున్నారు. నారాయణరావు కొంచెమాలస్యంగా వచ్చాడు. రాగానే స్త్రీలు కూచునేస్థలంలో కిట్టూ, సుశీలా వచ్చివున్నారేమో నని వెతుక్కున్నాడు. అవుపళ్లేదు. కనుక్కుంటే తెలిసింది: సుశీల వచ్చి చాలసేపయిందట. వచ్చి ఒంట్లో బాగోలేదని చెప్పి అప్పుడే వెళ్ళిపోయిందట. ఇంటికొకసారి వెళ్ళి వద్దామా అనిపించింది, నారాయణరావుకి. కాని రావడమే ఆలస్యంగా వొచ్చి, రాగానే తక్షణమే మళ్ళీ వెళ్ళిపోవటానికి సిద్ధపడితే బావుండదని నిలిచిపోయాడు.

శాస్త్రివొచ్చి మర్యాదా చేశాడు. వొస్తూనే అందుకున్నాడు, "వరుడెవరో తెలుసా? సుశీల మొదటిభర్త తమ్ముడట, నిన్ననే తెలిసింది నాకు." అని వొక వికపు నవ్వు నవ్వి మళ్లీ పెళ్లిహడావుడిలో పడ్డాడు; నారాయణరావు తెల్లబోయాడు. అయితే కావచ్చుగాని ఆకస్మికంగా అందరిలోనూ తనని అలా చిన్నబుచ్చుతాడా?

విందుభోజనమయింతరవాత అతిథులంతా తాంబూలాలు సేవిస్తున్నారు. పెండ్లికొడుకూ నారా

యణరావూ ఇష్టాగోష్ఠిలో పడటం తటస్థించింది. నారాయణరావు అతన్ని కదపకుండా తప్పించు కుందామనే అనుకుంటున్నాడు. కాని అతనే కావాలని పలకరించాడు. సంభాషణకి దిగక తప్పిందికాదు. మాటలమధ్య, "మా వొదినని చూడాలనివుంది వొచ్చి వెళ్లినట్టే తెలీదు నాకు," అంటున్నాడతను అప్రయత్నంగా. తనయెదట, సుశీలని మా వొదిన మా వొదిన అని అతను రెట్టించి అనడం మనస్కరించ లేదు నారాయణరావుకి. కాని భరించక తప్పింది గాదు. అతను బి. ఎ. దాకా కలకొత్తాలో చదివాట్ట. తన చదువులకని అన్నగారూ వదినగారూ ఇద్దరూ మూడేళ్ళపాటు కలకత్తాలో కాపరం పెట్టాలిసి వచ్చిందట. పూజా సెలవులలో తలవని తలంపుగా అన్నగారు కలరా తగిలి...అదేమిటి? నారాయణ రావుకి అగమ్యగోచరంగా వుంది. ఇన్నాళ్లూ సుశీల కన్యగా వుండగానే భర్తకాలం చేశాడని అనుకొంటూ వొచ్చాడు. మరిప్పుడు కలకత్తాలో కాపరాలంటూ దేమిటి? ఎన్నడో కాలగర్భంలో లీనమైపోయిన సత్యం ఇవాళ బయిటపడుతోందా?...... అతనింకా ఏమేమిటో చెప్పుకుపోతున్నాడు. నారాయణరావు సరిగ్గా వినిపించుకోటంలేదు. అతని మొహాన్ని కత్తివాటుకైనా నెత్తురుచుక్క లేదు. పాపన్నశాస్త్రి దూరాన్నుంచి గమనిస్తూ మాటల ధోరణి కనిపెట్టి సైగచేసి అల్లుణ్ణి తన దగ్గరికి రప్పించుకొని సంభాషణ తుంచేశాడు. నారాయణరావుకిదంతా అనుమానాస్పదంగా కనిపించింది. అది చాలక శాస్త్రి వరుడి చెవిలో ఏదో రహస్యం వూదుతున్నాడు. దానితో ఆ రహస్యం తనకి సంబంధించిందని స్పష్టపడింది. నారాయణరావుకి, శాస్త్రి ప్రవర్తనకి వొళ్లుమండి చివ్వున లేచాడు.

మౌనంగా వెళ్ళిపోతున్నా అతని మనస్సులో ఇందాక విన్నమాటలు వేటాడుతూనే వున్నాయి. ఏదో ఒక కఠోర సత్యాన్నుంచి పారిపోతున్నట్టుంది అతనికి. ఇంకా అక్కడ కొంతసేపు నిలిచి అతను చెప్పే సుశీల ఎవరో కాపరం ఎన్నాళ్ళు చేసిందో ఏమిటో, అన్నగారంటాడు ఏ అన్నగారో, అన్నీ వివరణగా కనుక్కొని తనకి కలిగిన అనుమానాన్ని స్థిరం చేసుకోవటమో లేకపోతే మొగ్గలోనే తుంచేసి నిశ్చింతగా వెళ్ళిపోటమో జరిగించాలిసి వుంది. కాని, నిజాన్ని అంత సూటిగా ఎదురుకునే శక్తి లేదతనికి. ఆరా తీస్తే తను భరించలేని విషయాలింకా ఏమి బయటబడతాయోనని అలజడి పుట్టిందతనికి. కాని, తెలిసిన నిజాలకంటే తెలియని నిజాలకి బాధించే నైజం ఎక్కువపదునుగా వుంటుందని అతనికితట్టలేదు.

గేటు కవతల ఎంగిలాకుల్లో వెతుక్కుంటూ కొట్లాడుతున్నారు యానాదులు. కాలేజీ ఆవరణలో గులాబీజామ చెట్లకింద పిల్లలు చిలకలు కొరికిన పళ్లు ఏరుకుంటూ అందని చిటారుకొమ్మలవంక ఆశగా చూస్తున్నారు. నారాయణరావు తలవంచుకొని పోతున్నాడు. సుశీల తండ్రి తనని అన్యాయం చేశాడా? ఏమో—వెయ్యి కల్లలాడి ఒక ఇల్లు నిలపమన్నారు. అందులోనూ, తన కన్నకూతురు విషయంలో అనుకూలమైన సంబంధం అమురుతుందో అమరదోననే ఆదుర్దాలో ఒక్క అబద్ధం—ఒక్కటి మాత్రమే—చెప్పాడూ అంటే నమ్మదగనిదేమీ కనుపించదు. సుశీలగూడా యీ కుట్రలో చేరినట్టేనా? గుండెల్లో చెయ్యి పెట్టి కలిచేసినట్టు బాధపడుతున్నాడు.

భల్లున తెల్లవారినట్టు రాత్రి హాయిగా నిద్రపోయి మెలకువ తెచ్చుకున్నవాళ్ళకి తెలుస్తుంది. కాని, నారాయణరావుకి మాత్రం జాగరణలో రాత్రంతా రెక్కలు తెగిన రాబందులా తన కళ్ళమీదనించి ఈడ్చుకొంటూ అతిభారంగా జరిగిపోయినట్లనిపించింది. ఉన్నవీ, లేనివీ, ఉండగలవీ, సాధ్యమయ్యేవీ సంభవమయ్యేవీ అన్నీ వూహించి కల్పించుకుని అతని మనస్సు లేని బాధను సృష్టించి మెదడుని కుళ్లబెట్టింది, రాత్రంతా. పక్కని జీడిమామిడి తోటలో అడవిపిచ్చుకల కోలాహలం కిటికీలోనుంచి గందరగోళంగా వినిపిస్తూ కళపెళమని మసిలే రక్తానికి మరి రెండు సమిధలు కలుపుతున్నట్టుంది. నిన్నటి సంఘటన తరవాత సుశీలకీ తనకీ మాటలు జరగలేదు. సుశీలకూడా ఏదో అగాధంలోపడి కొట్టుకుంటోందని అతనికి తెలుసు. రాత్రి రెండు ఝాములవేళ తను లేచి చూచినప్పుడు కంటబడిన దృశ్యం అతను మరచిపోలేదు. ఒక చేత్తో కిట్టుని జోకొడుతూ మరొక చేత్తో కన్నీళ్లు తుడుచుకుంటోంది, ఏమయితేనేం? సుశీల పవిత్రమయింది—తనమీద పంచప్రాణాలు పెట్టుకున్నది—తనుతప్ప మరొక ప్రపంచం లేనిది—తానే సర్వస్వమూ అని నమ్ముకున్నది—క్షమించలేనా అనుకున్నాడు. దానితో మనస్సు కుదటబడింది. క్షణకాలం అతని మెదడు కలిపేస్తున్న ఆలోచనలమీద హృదయం తిరుగుబాటు చేసింది. కాని అది తన హృదయదౌర్బల్యమేమో నన్న సంశయం వదలలేదు. వెచ్చనిదిళ్లూ, మెత్తనిపానుపులూ కావలిసినవి అమర్చిపెట్టే సౌకర్యాలూ వీట్లతో దినదినమూ ఆమె ఆదరణకి అలవాటుపడి ఆమెనీ ఆ సదుపాయాలనీ వొదులుకునే ధైర్యం లేక ఏ ఎంగిలిబ్రతుకయితేనేం, ఎలాగో వొహలా సరిపెట్టుకోగూడదా అనే నైచ్యానికి

సిద్ధపడుతోందా అంతరాత్మ? —ఆలోచన తెగలేదు— అయితే కొన్నాళ్లు భర్తతో కాపరం చేసిన స్త్రీకి పునర్వివాహం చేసుకునే అర్హత లేదని అనడు. ఈ రహస్యం మొదట్లో తనకి తెలిసినా అంత బాధించేది కాదేమోనని ఇప్పుడనిపిస్తోంది. కాని, ఇన్నాళ్ళూ తనని మురిపించిన భావన వేరు. ఈ సుశీల తన సుశీల కాదు. తన సుశీలరాలని మంచుబొట్టులా నిర్మలమయినది. 'వాసనచూడని ప్రసనం' ఆమె మొదటి యవ్వనపు హొంగులు, మలినంకాని కోరికల గుబాళింపులను తొలి కానుకలుగా తానే అందుకున్నాననుకున్నాడు. ఆ వూహాస్వర్గంలో నించి పతనాన్ని సహించలేకపోయాడు.

రాత్రి భోంచేసి వొంటరిగా సముద్రపువొడ్డుకి వెళ్ళిపోయాడు నారాయణరావు. విరిగిన కెరటాల తుంపరలు మీద పడుతున్నాయి ప్రాణం హాయిగా వుంది. కెరటాలు లేకపోయినా సముద్రం గంభీరంగా అవుపించింది. సముద్రమూ ఆకాశమూ, ఎత్తయినకొండలూ చూస్తే మానవుడిలోవున్న సంకుచితత్వం రవంతసేపు పక్కకి తొలుగుతుంది. నారాయణరావు తీవ్రంగా ఆలోచించాడు. ఇందులో సుశీల అపరాధమేమీ కనిపించదు. మరొకవ్యక్తి కోరకయితే ఈ అసత్యం చెప్పాలిసిన అవసరమే లేకపోను. తన వుద్దేశాలూ గుట్టూ తెలుసును గాబట్టి, ప్రత్యేకించి తననే కావాలని కోరి వరించిన సుశీల తండ్రిని అబద్ధం చెప్పమని ప్రోత్సహించినా తప్పేమీ వున్నట్టు తోచదు. తనకోసమే గా? అప్పట్లో నిజం చెప్పివుంటే తను దక్కకపోయేవాడేమోకూడా. తన కుశంకలన్నిటికీ తరతరాల నించీ పురుషవర్గంలో పాతుకున్న స్వార్థమూ, ఈర్ష్యాపునాదులేమో? సామాన్య గృహస్తుకి మల్లే తనూ పెళ్లాన్ని నాలుగతన్ని బైటికి ఈడ్చి, తెలుసుకుంటే మళ్ళీ పెళ్ళిపీటలమీద కూచోగలడు. కాని ఉన్నతంగా ఆలోచించి చూసుకుంటే ఇది క్షమించరాని అపరాధమా? చివాలున లేచి ఇంటిమొహం పట్టాడు.

పాపం —సుశీల ఎంత బాధపడుతోందో. ఆమె అమాయికపు చూపులు మళ్ళీ తలపుకువచ్చాయి. నైర్మల్యం తరగని ఆ చూపులికి కళంక మంటగట్టి తానే పాపం చేస్తున్నాడు.

సముద్రపుగాలికి వెన్నెలతోడై చలి వొణికిస్తోంది—ఇందాకటినుంచీ తెలియలేదు.

ఇంటి ఆవరణలో అడుగుపెట్టగానే కొండంత బరువు దించేసినట్టయింది. తలుపుకొట్టేముందు కిటికీలోనించి తేరిపారజూశాడు. లోపల పరుపుమీద సుశీలా కిట్టూ ఇద్దరూ మైమరచి నిద్రపోతున్నారు. సుశీల చెంపలమీద కన్నీటి చారికలింకా చెరగనైనా లేదు. కిట్టూ వులిక్కిపడ్డాడు. క్షణకాలం నారాయణరావు నిశ్చలంగా చూశాడు. ఏదో ఆకర్షించిందతన్ని. ఆ ముఖాలలో ఇదివరకెన్నడూ గోచరించని పోలికలు స్పష్టంగా ఇప్పుడు బయటపడుతున్నాయి. అవతల కిటికీ వూచలలోనించి ఆ రెండు ముఖబింబాలమీదా వెన్నెలపడి ముక్కుతీరులోనూ, నుదుటి వంపులోనూ, పెదిమల వృత్తాకృతిలోనూ, ఇన్నాళ్లూ కనపడని సూక్ష్మాతి సూక్ష్మమైన పోలికలని వెతికి వెతికిపట్టి ఇస్తోంది. కళ్లు రెండూ భూతద్దాలకింద మలుచుకుని చూస్తున్నాడు నారాయణరావు. తనదృష్టిలో ఏమైనా దోషమున్నదేమో— మతిభ్రమణం కాదుగదా? తీక్షణంగా చూశాడు. పగలు విరామంలేని కదలికలో చెలించే నీటిలో చంద్రబింబంలా ఏ ఆకారమైనా అలుముకుపోయి అనేక భంగిమలలో కనపడుతుంది. రాత్రి నిద్రలో, ఆ ప్రశాంతిలో రూపురేఖలన్నీ తేరుకుని పరిశీలనకవకాశమిస్తాయి. సుశీలకి కిట్టూ అంటే వున్న అపారమైన వాత్సల్యమూ, పాపన్నశాస్త్రి అల్లుడి చెవిలో వూదిన రహస్యమూ...ఒకదానితో ఒకటి సంబంధంలేని హంశాలెన్నో అతుక్కుని లంకె వేసుకుంటున్నాయి. కిట్టూ లాహోరు ప్రాంతాలలో కాళీ వుత్సవాల జనసమ్మర్దంలో తలిదండ్రులవద్ద నించి తప్పిపోయిన శిశువనీ, సుశీల భర్త ఆ ప్రాంతాలలోవాడేననీ ఒకేసారి తళుక్కున స్ఫురించాయి నారాయణరావుకి. దానితో ఏదో మీట నొక్కినట్టయి, ఆరిపోయిన అనుమానాలన్నీ మళ్ళీ గుప్పున వెలిగాయి. అతని గుండెలో రాయిపడింది. సుశీల సంతానవతి కూడానా? ఇందాకటినుంచీ సద్దుమణిగి పడివున్న అసహ్యాలు, ఈర్ష్యలూ—అన్నీ మేలుకుని చురకత్తులకింద మారి చకచకా పదును పెట్టుకుంటున్నాయి. ఎక్కడ వీ పోలికలు?

గిరుక్కున మళ్ళాడు.

మర్నాడు సాయంత్రం పాపన్నశాస్త్రి ఎందుకో వచ్చాడు. సుశీల సమాధానం చెప్పింది నారాయణరావింట్లో లేడని. వెళ్ళిపోటానికి గడప దాటుతున్నాడు.

“మీతో మాట్లాడాలిసివుంది-ఒక్క మనవి-” అన్నది సుశీల. ఆమె లోపల తలుపుకి అరచాటుగా నిలబడింది లజ్జగా. అంతవరకూ పాపన్నశాస్త్రితో ఎన్నడూ చనువుగా సంభాషించి ఎఱగదు.

ఆగాడు. జరగబోయే సంభాషణ ఏమిటో ముందుగానే బాగా తెలిసివున్న ధోరణిలో తాపీగా కూచున్నాడు పాపన్నశాస్త్రి.

"నా వివాహవిషయంలో మా నాన్నగారు దాచి వుంచిన కొన్ని సంగతులు మీయెదట పెట్టాలని వుంది" అని సందేహించింది సుశీల.

"అమ్మాయీ నాకంతా తెలుసును. నువ్వు ఆదుర్దాపడకు" అన్నాడు పాపన్నశాస్త్రి—ఆమె నివ్వెరపోయింది

"నువ్వు నీ భర్తతో కొన్నాళ్లు కాపరం చేశావనీ—"

"మా నాన్నతో ఎంత వాదించినా నిజం చెప్పటానికి వొప్పుకోలేదు. నేను అస్వతంత్రురాలిని."

"నీ కొక కుమారుడు కలిగాడనీ..."

సుశీల కళ్లల్లో బెదురు స్పష్టంగా కనిపిస్తోంది.

"ఆ పసివాడు లాహోర్లో కాళీ వుత్సవాలలో తప్పిపోయాడనీ..."

"అంతేనా."

"ఇప్పుడు నీదగ్గిరవున్న కిట్టూ నీ కన్నకొడుకేననీ..."

సుశీల ఉరిశిక్ష విన్న నేరస్తుడిలా నిలబడింది.

"ఇక నే వెడతా," అని లేచాడు.

"ఇదంతా మావారికి తెలిసినట్టేనా?" దీనంగా అడుగుతోంది సుశీల.

"అమ్మాయీ నా కడుపున పుట్టిన బిడ్డ వొకటీ, నువ్వు మరొకటీనా నాకు. నీ సంసారం చితికిపోతే నాకు ముచ్చటా? నిన్న మా అల్లుడు సందర్భవశాత్తూ కొంతవరకూ చెప్పేశాడు—మీ ఆయనా నువ్వూ కలకత్తాలో కొన్నాళ్లు కాపరం పెట్టారని—అంతే. నేను ధోరణి బాగుండలేదని కనిపెట్టి సైగచేసి వారించాను; దానితో ప్రమాదం తప్పింది."

"మీరు దేవతలా సాక్షాత్కరించి నాకన్నబిడ్డని నా చేతులకి వప్పగించారు. వాడి భవిష్యత్తులో ఏమి సుడిగుండాలున్నాయో నాకు తెలియదు" అన్నది సుశీల గద్గదికతో.

"తల్లీ - బెంగపెట్టుకోవద్దు. గుండె రాయి చేసుకోవాలి. తప్పదు. నారాయణరావుతో నాకీ ప్రస్తావన అప్పుడే వచ్చింది. అతను దారికి వచ్చేటట్టు లేడు. కాని ప్రయత్నిస్తాను - కాని, అమ్మాయీ, వొకటి చెబ్తా విను. మన అంతరాత్మలో మకిలివున్నంతసేపూ ప్రపంచాన్ని శుభ్రంగా చూడలేమంటే నమ్ము."

పాపన్నశాస్త్రి వెళ్లిపోయాడు.

సుశీలకి ఆందోళన ఎక్కువయింది—అప్పుడే ఆమెకి తెలిసింది - నారాయణరావు పిఠాపురందివాణం ఆఫీసులోకి బదిలీ చేయించుకునేందుకు రాజాగారితో సంప్రదిస్తున్నాడనీ, అర్ఫనేజి బాలికలవల్ల కొంత సూచాయగా వింది—కిట్టూని తిరిగి శరణాలయంలో చేర్పించేందుకు నిశ్చయించుకున్నాడనీ. చీకటి పడుతున్నకొద్దీ ఆమె మనస్సు మనస్సులో లేదు. ఉదయమనగా అర్ఫనేజి స్కూలికి వెళ్ళినకిట్టూ ఇంతవరకూ రాలేదు. గబగబా స్కూలుకివెళ్లి కిట్టూని తీసుకొచ్చేసింది. కిట్టూని శరణాలయంలోనే వుండాలని నిర్బంధపెట్టారట. అప్పుడే ఎక్కడనించో వొచ్చాడు నారాయణరావు. ఆమెవంక చూడకుండా నే రిస్టువాచీ మేజాబల్లమీదపెడుతూ "కిట్టూని శరణాలయంలోనే వుంచెయ్యడం మంచిది" అన్నాడు. సమాధానం రాలేదు. "తరవాత నీ ఇష్టం" అని ముభావంగా వెళ్లిపోయాడు నారాయణరావు. రాత్రి మెయిల్లో పిఠాపురం వెళ్ళాలట — అర్జంటుగా. ఉదయమే వస్తానన్నాడు.

గదిఅంతా చిమ్మచీకటిగా వుంది. లోపల కిట్టూ ఏడుస్తున్నాడు. సుశీల ఖంగారుగా కిట్టూని కావిలించుకుని బావురుమని యేడిచింది. తననీ తన కిట్టూనీ వేరుచేయాలన్న సంకల్పం నారాయణరావుకే కలిగిందో లేకపోతే ఇతరుల సలహాకి ఫలితమో ఆమె వూహ కందలేదు. కాని అలాంటి నిర్ణయం తన వెనకాల జరుగుతోందని మాత్రం ఆమె బాగా పసికట్టింది. "కన్నా—నిన్ను వదలనులే తండ్రీ" అని కన్నీళ్లతో సముదాయించింది. ఆఃటికి చీకట్లో కిట్టూ మాయమవుతాడేమో—చీకటి మింగేస్తుందేమో... చెప్పరాని దుడుకుగా వుంది సుశీలకి. దీపంలేని సంగతి తట్టనేలేదు సుశీలకి. గబగబా లాంతరు వెలిగించింది. ఆమె చేతుల్లోనే సోలివాలి నిద్రపోయాడు కిట్టూ. దీర్ఘాలోచనలో మునిగిపోయింది సుశీల.

విధి బలవంతాన ఎక్కడికో అజ్ఞాతంలోకి లాక్కుపోయి తిరిగి ఈనాడు మళ్లా అప్రయత్నంగా, పెన్నిధిలా, ఆకస్మికంగా తన వొడిలో పడిన అమృతఫలం!! ఎలా వొదులుకుంటుంది? కిట్టూ తప్పిపోయింది లగాయితూ, ఎంతమంది దేవుళ్లకి

మొక్కిందో, ఏకాంతంగా ఎవళ్ళకీ తెలియకుండా; కిట్టూ ఏమయినాడో ఏ పేదగుడిసెలో ఆకలికి అలమటించి పోతున్నాడో, ఏ కఠోర హస్తాలలో కక్కటిల్లి పోతున్నాడో అని ఎన్నిసార్లు కుమిలి కుమిలి ఏడిచిందో, మళ్ళీ కిట్టూ తన చేతిలో పడేవరకూ కళపెళ మసిలే ఎన్ని అగ్నిపర్వతాల్ని లోపల రహస్యంగా దాచుకుందో ఎవరికి తెలుసును?—ఎంత మంది దండెత్తిరానీ, తన ప్రాణాలు వాడిమీద కవచంలా కప్పి రక్షించుకుంటుంది. తన రక్తంతో వాడి చుటూ గిరిగీసి కాపలా కాయుంటుంది కాని వని లేదిలేదు.

ఆ క్షణంలో నారాయణరావు ఎవరో? అనిపించింది. తనకీ అతనికీ సంబంధమేమిటి? పరపురుషుణ్ణి చూడాలిసిన దృష్టితో అతన్ని పరామర్శించుకుంటోంది సుశీల. తాను తెలియక ఇతరుల స్థలంలో అడుగు పెట్టినట్టూ దానికి శిక్ష అనుభవిస్తున్నట్టూ భావించుకుంటోంది. ఎందుకు తాను మళ్ళీ పెళ్ళి చేసుకుంది? దేనికి కుప్ప కూలిన యింటికి మళ్ళీ పునాదులెత్తుకుని కూచున్నది? క్షమించరాని అపరాధమేదో చేసినట్టు మనస్సు కోత పెడుతోంది. ఆ ఇల్లే యిప్పుడు గోరీకిందమారి తననీ తన కిట్టూనీ మింగాలని నోరు తెరుచుకుని కూచుంది. కిట్టూ తనదగ్గర వున్నంతకాలమూ, కిట్టూకోసం దేశదేశాలు వెతికించినన్నాళ్ళూ, కిట్టూ మళ్ళీ దొరుకుతాడన్న ఆశ మిణుకు మిణుకు మన్నంతకాలమూ, మళ్ళీ పెళ్ళిచేసుకుంటావా అని అడిగే సాహసం తన తండ్రికిగాని చుట్టుపక్కల ఎవరికిగాని కలగలేదు. కిట్టూ తన జీవితంలో మళ్ళీ తప్పటడుగులు వెయ్యబోతున్నాడని కలగనివుంటే, తన కళ్ళల్లో కాంతులు జల్లడానికి, తన యెడారి బ్రతుకులో చిరునవ్వులు చిలికించటానికి మళ్ళీ అమృతకలశం పుచ్చుకుని ఎదురవుతాడని అణుమాత్రమైనా ఆశ మిగిలివుంటే ఏ కొండగుహాలోనో, ఏ మహారణ్యంలోనో తల దాచుకొని తన కిట్టూకోసం కళ్ళల్లోకి ప్రాణాలు తోడుకొని ఎన్ని యుగాలైనా ఎదురుచూసేదే! కాని, పవిత్రతని అర్థం చేసుకోలేని, మాతృత్వాన్ని మన్నించలేని కర్కశహృదయాలమధ్య ఒకళ్ళ చేతుల్లో తన కిట్టూ భవిష్యత్తు అల్లాడవలసిన దుస్థితి కలిపించేదా?

ఈ అలజడిలో కర్తవ్యం మరచిపోయింది—సుశీల. తెల్లవారగనే నారాయణరావు వస్తాడు. కిట్టూ ప్రస్తావన తప్పకుండా వొస్తుంది. ఏమిటి బదులు చెప్పాలి? స్పష్టంగా ఊహించగలిగింది కూడా. కిట్టూని వదలమంటే ఇద్దరినీ బయటికి నెట్టి తలుపు వేసుకుంటాడు. కిట్టూని విడిచిపెట్టడానికి అంగీకరిస్తే తిట్టుకొంటూనో, అసహ్యించుకొంటూనో, బాధిస్తూనో వేధిస్తూనో ఆజన్మాంతము ఏలతాడు. తన భావిజీవితాన్ని ఊహించి చూచుకుంటే కోత పుట్టింది సుశీలకి. చప్పున లేచి ఒక నిశ్చయానికి రాగలిగింది. ఇక తప్పదు. చేతులనున్న బంగారు గాజులూ, మెడలో చంద్రహారమూ అన్నీ వొకదాని తర్వాత వొకటి వూడ్చి మేజాబల్లమీద పెట్టింది. ఆ యింట్లో తన గతజీవితాన్ని కూడా అలాగే వూడ్చి వేసుకోగలిగితే బాగుండు ననిపించింది.

అప్పుడే తెలతెలవారుతోంది. తూర్పున తెల్లటి రేఖలు శిక్షాపత్రాన్ని విప్పుతున్నట్టున్నాయి. కిట్టూ గాఢంగా నిద్రపోతున్నాడు. ఎత్తుకుని భుజాలమీద వేసుకుంది. తాను అజ్ఞానంగా పారవేసుకున్నా మళ్ళీ వెతికి దేవుడే తన బాధ్యతకి అప్పగించివెళ్లిన తియ్యని బరువు! ఇల్లంతా ఒక్కసారి కలియజూచింది. నారాయణరావు పుస్తకాలూ, గుమ్మానికని తాను సగమల్లిన గుడ్డతెరా, పిల్లలతో కళకళలాడే ఇంటి ఆవరణా, పాలరాతి చీడీలూ, నారాయణరావుతో ఆ పావంచాల మీద గడిపిన మధుర క్షణాలూ, బంగాళాబంతి చెట్ల నీడలు మసిలే కాంపౌండు గోడ—అన్నీ, నా అన్న తెర పడి మొదటిసారి నగ్నంగా అవుపించాయి... వొక కలలో మనిషిలా వెళ్లిపోతోంది.

శరణాలయంలోంచి గీతాలు, వినిపిస్తున్నాయి. మేలుకునే పిల్లల కలకలంతో శరణాలయమే వొక జాలిగుండెలా స్పందించింది. గీతాలు పై కుబికే కరుణామృతపుంజాలా అన్నట్టు పొంగులువారినై. కలింగలకాలవగట్టు వెంబడి నడిచిపోతోంది సుశీల. రేవులలో కార్తీకస్నానాలు చేస్తున్నారు. ముత్తైదువులు. అరటిదొప్పలలో వెలిగించిన కార్తీకదీపాలు ప్రవాహంలో చుక్కల్లా సురిగిపోతున్నాయి, సత్సంతానంకోసం పుణ్యస్త్రీల హృదయసీమలలో కొనలుసాగే కోరికల వెలుగులా అన్నట్టు.

కిట్టూని హృదయానికి దగ్గరగా అదుముకుంది సుశీల. చూపుమేర దూరంలో, చీకటిగుయ్యారంలో, గానుగచెట్ల చిక్కని నీలినీడలలో ఆమె మాయ మయ్యింది. ఎక్కడికో—విధి ఈడ్చికెళ్లేచోటికి—విశాలప్రపంచంలోకి.